క్లుప్తంగా

బీజేపీ మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలిగా చిత్రలేఖ



ఆత్మకూరు(ఎం): బీజేపీ మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలిగా ఆత్మకూరు(ఎం) మండలం కొరటికల్ గ్రామానికి చెందిన చామకూర చిత్రలేఖను నియమిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ బుధవారం నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు కస్తూరి మాధురి, బీజేపీ మండల అధ్యక్షుడు గజరాజు కాశీనాథ్ పాల్గొన్నారు.

ఎల్‌పీహెచ్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శిగా రాజేష్ నాయక్

భువనగిరి : లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శిగా జిల్లాకు చెందిన రాజేష్ నాయక్‌ను నియమిస్తూ బుధవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్ నాయక్ నియామక పత్రాన్ని ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంబాడీ హక్కుల సాధన కోసం కృషి చేస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

26న ఉపవాస దీక్ష

భువనగిరిటౌన్ : భువనగిరి పట్టణం, మండల పరిధిలో గల ప్రభుత్వ మిగులు భూములను నిరుపేదలకు పంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న భువనగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్ నిర్వహించనున్న ఉపవాస దీక్షను జయప్రదం చేయాలని సీపీఐ భువనగిరి పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, మండల కార్యదర్శి మరిపెల్లి రాములు బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. దీక్ష సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు పాల్గొంటారని తెలిపారు.

కరపత్రాల ఆవిష్కరణ

భువనగిరిటౌన్ : ఆగస్టు 9న ఢిల్లీలో నిర్వహించనున్న మాదిగల మహాధర్నాను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికారి ప్రతినిధి బొట్ల శంకర్ మాదిగ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరేళ్ల రమేష్ మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక రహదారి బంగ్లాలో ధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంగాపురం స్వామి, భైరపాక నాగరాజు, ఇటికాల శ్రీను, కొంపల్లి భాస్కర్, తుడి నారాయణ, జెరిపోతుల యాదగిరి, ముదుగుల రామచందర్, బొట్ల పరమేష్, మైలారం రమేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో..

భువనగిరిటౌన్ : ఈ నెల 30 31వ తేదీల్లో రామన్నపేట మండల కేంద్రంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాసభలకు సంబంధించిన కరపత్రాన్ని బుధవారం కలక్టరేట్‌లో కలెక్టర్ హనుమంతు కే. జెండగే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్, జిల్లా అధ్యక్షులు సురేపంగ ప్రకాశ్, మహిళ జిల్లా కన్వీనర్ కొత్త లలిత, పాండాల అంజన్, గోపి ఉన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

మోటకొండూర్: ఈ నెల 27,28వ తేదీల్లో రామన్నపేట పట్టణంలో నిర్వహించనున్న సీఐటీయూ జిల్లా శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను బుధవారం సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు కొల్లూరి ఆంజనేయులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గోసంగి పరమేష్, బోగారం వీరస్వామి, తొండల సతీష్, పాండు, వంగపల్లి దయాకర్, ఆడెపు శ్రీధర్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

బస్సును పునరుద్ధరించాలి

వలిగొండ : మండలంలోని కేర్చిపల్లి గ్రామానికి గతంలో ఉన్న నైట్ హాల్ట్ బస్సును వెంటనే పునరుద్ధరించాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. మండలంలోని కేర్చిపల్లి గ్రామంలో బుధవారం సీపీఎం పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కందాడి సత్తిరెడ్డి, ముత్యాలు, దొడ్డి భిక్షపతి, సాయిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బుచ్చిరెడ్డి, నరసింహ, చంద్రయ్య పాల్గొన్నారు.

సేంద్రియ సాగుపై అవగాహన

భువనగిరి రూరల్ : మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో గల అమేయ కృషి వికాస కేంద్రంలో సేంద్రియ సాగుపై అజీవ ఫార్మర్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ఆధ్వర్యంలో బుధవారం 30 మంది మహిళా రైతులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీస్ డైరెక్టర్ నిమ్మయ్య, అరుణ అజీవా చైర్మన్ ఎలుబాయి, జిట్టా బాల్‌రెడ్డి, జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

భువనగిరి రూరల్ : భువనగిరి మండల ఎంపీడీగా దినకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీఓగా విధులు నిర్వహించిన అనురాధ రాజపేటకు బదిలీపై వెళ్లారు.

రామన్నపేట : మండలంలోని దుబ్బాక పంచాయతీ కార్యదర్శిగా కె.కవిత, నీర్నెములకు ఎం.లక్ష్మీనర్సమ్మ, ఉత్తటూరుకు ఎ. ఉపేందర్, శోభనాద్రిపురం ఎం.పవన్‌కుమార్, లక్ష్మాపురం ఎన్.విఠల్‌కుమార్, వెల్లంకి కార్యదర్శిగా ఆర్.మోహన్‌లు బాధ్యతలు స్వీకరించారు. నీర్నెములలో బాధ్యతలు స్వీకరించిన పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనర్సమ్మను గ్రామస్తులు శాలువాతో సన్మానించారు.

వైద్యాధికారిగా వంశీకృష్ణ

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిగా వంశీకృష్ణ నియమితులయ్యారు. గతంలో ఇక్కడ పని చేసిన డాక్టర్ విలియం కేరి యాదగిరిగుట్టకు బదిలీపై వెళ్లారు.

ఇళ్ల మధ్యే స్క్రాప్ దుకాణాలు

- మోత్కూరులో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న పాత ఇనుప సామాను షాపులు
- విషసర్పాలు, దోమలకు నిలయంగా మారుతున్న వైనం
- పాటించని నిబంధనలు.. పొంచి ఉన్న ప్రమాదం



పాత ఇనుప సామాను దుకాణం



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

మోత్కూరు : మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో పాత ఇనుప సామాను దుకాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఇళ్ల మధ్యే ఈ దుకాణాలను ఏర్పాటు చేస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో నివాస గృహాల మధ్య ఏర్పాటు చేసిన పాత ఇనుప సామాను దుకాణాలతో ఇబ్బందులు పడుతున్నామని ఇటీవల కాలనీవా సులు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పాత ఇనుప సామాను దుకాణాలను నివాస గృహాల మధ్య నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. నిబంధలు పాటించకుండా దుకాణదారులు ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్న పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

దోమలు, పాములకు నిలయంగా..

ఇళ్ల మధ్య పాత ఇనుప సామాను దుకాణాలు ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాత ప్లాస్టిక్ డబ్బాలు, అట్టా డబ్బులు, తుప్పు పట్టిన ఇనుప వస్తువుల్లో వర్షపు నీరు చేరి దోమలకు నిలయంగా మారుతున్నాయని దీంతో రోగాల భారిన పడుతున్నామని వాపోతున్నారు. దుకాణాల్లో పేరుకుపోయిన సామానుల్లో పాములు, విషపు పురుగులు స్థావరాలు చేసుకుని రాత్రి వేళల్లో నివాస గృహాల్లోకి వస్తున్నాయని.. ఖాళీ సీసాలు పగిలి వాటి ముక్కలు రోడ్డుపై పడుతుండటంతో ఎక్కడ కాళ్లకు గుచ్చుకుంటాయోనన్ని భయపడాల్సి వస్తుందని దీనికితోడు పాత ఇనుప సామానును తుక్కుగా చేసే క్రమంలో భారీ శబ్దాలు రావడంతో కాలనీల ప్రజలు భయందోళనకు గురవుతున్నామని పలువురు కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతులు

నివాస గృహాల మధ్యన ఏర్పాటు చేసిన పాత ఇనుప సామాను దుకాణాలను ఇళ్ల మధ్య నుంచి తొలగించాలని కోరుతూ పలువురు కాలనీవాసులు ఇటీవల మున్సిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్‌కు వినతులు అందజేశారు. అధికారులు స్పందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఇళ్ల మధ్యలో ఉన్న దుకాణాలపై చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్న ఎవరూ పట్టించుకోవడం లేదని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇళ్ల మధ్య ఉన్న పాత ఇనుప సామాను దుకాణాలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

దుకాణాలను తొలగించాలి



ఇళ్ల మధ్య ఏర్పాటు చేసిన పాత ఇనుప సామాను దుకాణాన్ని తొలగించాలని పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశాం. అధికారులు స్పందించడం లేదు. అధికారుల తీరుపై మున్సిపల్ ఆఫీస్ ఎదుట కాలనీ ప్రజలతో ధర్నా చేయడానికి సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికైనా స్పందించి నివాస గృహాల మధ్య ఉన్న ఇనుప సామాను దుకాణాలను తొలగించాలని కోరుతున్నాం.

– ఎర్రోజు యశ్వంత్‌చారి,మోత్కూరు

ఇబ్బందులు పడుతున్నాం



దుకాణాల్లో పేరుకు పోయిన పాత ఇనుప సామానులో వర్షపు నీరు చేరి దోమలకు నిలయంగా.. పాములు, విషపు పురుగులకు ఆవాసంగా మారుతున్నాయి. పాత ఇనుప సామాను దుకాణం నుంచే దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి మా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాం

– దూదల మహేష్, మోత్కూరు

నోటీసులు జారీచేశాం



పాత ఇనుప సామాను కొనుగోలు దుకాణదారులపై ఫిర్యాదులు రావడంతో దుకాణాన్ని ఖాళీ చేయాలని నోటీసులు జారీచేశాం. నివాస గృహాల మధ్యన దుకాణాలు ఉండడంతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీ ప్రజలు తమకు ఫిర్యాదు చేయడంతో దుకాణ యజమానులను హెచ్చరించాం. తదుపరి వృత్తి వ్యాపార లైసెన్స్ రద్దు చేసి యాజమాన్యాలపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

– సి.శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్, మోత్కూరు

రక్తదానం ప్రాణదానంతో సమానం : ఏసీపీ



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏసీపీ మధుసూదన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రంగా రెడ్డి

సంస్థాన్ నారాయణపురం: రక్తదానం ప్రాణదానంతో సమానమని చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఎంఎస్ఆర్‌ల ఆధ్వర్యంలో అమరవీరులు మర్రి నర్సిరెడ్డి , సుక్క అబ్బయ్య, నడికుడి శంకరయ్య, బచ్చయ్యల 25వ వర్ధంతి సందర్భంగా మండలంలోని పుట్టపాక గ్రామంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత బాధ్యతగా రక్తదానం చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. అన్నదానాల్లో కెల్లా రక్తదానం గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు బి.వెంకట్, జిల్లా కార్యదర్శి జహంగీర్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్, ఎంఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ మర్రి వసంతనర్సిరెడ్డి, సీనియర్ జర్నలిస్టు మర్రి మహేందర్‌రెడ్డి, మర్రి మనోహర్ రెడ్డి, దొంతగాని అమరేందర్, కొత్త శ్రీకాంత్, నడికుడు నరసింహ, పాంగుల శంకరయ్య, వంగూరి సాయి కిరణ్, కర్నాటి నరేష్, ఐతరాజు లింగస్వామి, గాజుల మహేష్, గాజుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



షూ, టై, బెల్టులు అందజేస్తున్న దాతలు

మోత్కూరు : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని రెడ్‌క్రాస్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా చైర్మన్ గుర్రం లక్ష్మీనర్సింహ రెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన రాపోలు శేషాద్రి జ్ఞాపకార్థం ఆయన కుమారులు రాపోలు వెంకటేశ్వర్లు, పరందాములు, సుదర్శన్‌లు బుధవారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని అంగడీబజార్, పద్మశాలీకాలనీ ప్రాథమిక పాఠశాలల్లోని 200 మంది విద్యార్థులకు షూ, టై, బెల్టులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, క మిషనర్ సి.శ్రీకాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.రవీందర్‌రెడ్డి, సుగుణమ్మ, రాపోలు స్వాతి, అవిశెట్టి అవిలుమల్లు, ఉపాధ్యాయులు హన్మంతు, లలితా, సౌజన్య, జ్యోతి, అనిత పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

ఆలేరురూరల్ : ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యమైందని మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ అన్నారు. ఆలేరు పట్టణ కేంద్రంలో బుధవారం మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడకలు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి ఘనంగా నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ కింద రైతులందరికీ మాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పడమే తప్పా.. చేసింది శూన్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వారిని మోసం చేస్తుందని విమర్శించారు. ఇప్పటివరకు ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదన్నారు. మెగా డీఎస్సీ ఏమైందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేషం, గంగుల శ్రీనివాస్, రచ్చ రామ్‌నర్సయ్య, మొరిగాడి వెంకటేష్, బేతిరాములు, ఆర్.నర్సింహులు, కందు శ్రీకాంత్, జల్లి నర్సింహులు, కుండె సంపత్, రాంప్రసాద్, బీజని మధు, పత్త వెంకటేష్, సంతోష్, దయ్యాల సంపత్, అంజన్‌కుమార్, మురహరి, ఐలికృష్ణ, కంతి మహేందర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడి ఇచ్చే పంటలను పండించాలి



రైతులకు భూసార పరీక్ష కిట్‌లను అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

రామన్నపేట: రైతులు అధిక దిగుబడి ఇచ్చే పంటలను పండించాలని సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్.జి.రత్నాకర్ అన్నారు. మండలంలోని కక్కిరేణి గ్రామంలో భారతీయ వరి పరిశోధన సంస్థ, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్‌బీఐ సీఎస్ఆర్ ఫండ్ సహకారంతో రైతులకు డైరెక్ట్ సీడ్ రైస్ పద్ధతిపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో వెదజల్లే పద్ధతిలో 85 మంది రైతులు 300 ఎకరాలలో వరి పంటను సాగు చేయటం అభినందనీయమన్నారు. వరి పంటలో కలుపు సమస్యలను నివారించాలన్నారు. పంటల దిగుబడిలో ఎలాంటి సమస్యలు వచ్చిన వ్యవసాయ అధికారులను, శాస్త్రవేత్తల సూచనలను పాటించాలన్నారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ (ఐఐఆర్ఆర్) సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మంగళ్ దీప్ టుటీ మాట్లాడుతూ వరి పంటలో వచ్చే సమస్యలు, అధిక దిగుబడికి తీసుకోవాల్సిన మెలుకువలను వివరించారు. అనంతరం భూసార పరీక్ష కిట్లను రైతులకు అందజేశారు. అంతకుముందు చిల్ల వెంకన్న వరిపొలాన్ని శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముక్కాముల రవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన రైతు అవగాహన సదస్సులో ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్తలు డాక్టర్ మిలన్ జ్యోతి కోన్వర్, ప్రాజెక్ట్ మేనేజర్ డి.శ్రీనివాస్, టి.శ్రీకాంత్, ఫౌండేషన్ సభ్యులు, మాజీ సర్పంచ్ క్రిష్టారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ రామ్‌రెడ్డి, సైదులు, శ్రీశైలం, కిషన్‌రావు, కమలాకర్, వెంకన్న, మురళిక్రిష్ణ, రమేష్, మల్లేష్, సత్యనారాయణ, శ్రీను పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



ఆలేరురూరల్ : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటశ్రీను



భూదాన్‌పోచంపల్లి : అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ కె. భాస్కర్‌రెడ్డి

ఆలేరురూరల్ : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆలేరు ఎస్సై వెంకటశ్రీను అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని స్థానిక ఎస్ఆర్ కళాశాలలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చెన్న రాజేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కాసుల నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు మత్తు పదార్థాలకు బానసలుగా మారి భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దన్నారు. విద్యార్థులు, యువత ఈవ్ టీజింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ కంతం రమేష్, గడ్డం వెంకటేష్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బుగ్గ నవీన్, ప్రశాంత్, ధీరజ్, కళ్యాణ్, చంద్రశేఖర్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్‌లో డ్రగ్స్ నిర్మూలన, సైబర్ నేరాలు, చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్, మత్తు పదార్థాలకు యువత బానిసలుగా మారి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. చైన్‌స్నాచింగ్, దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీను, డీ. రాజశేఖర్, ఎ. వినోద్‌కుమార్, వెంకటేశ్, గోవర్ధన్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని భిక్షాటన



భిక్షాటన చేసి నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

భూదాన్‌పోచంపల్లి : పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్మికులు బుధవారం మండల కేంద్రంలో భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికుల యూనియన్ రాష్ట్ర మహిళా కన్వీనర్ పొట్ట యాదమ్మ, జిల్లా కార్యదర్శి గద్దం ఈశ్వర్ మాట్లాడుతూ ఏడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు గ్రామపంచాయతీ కార్మికులను రెగ్యులరైజ్ చేసి కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 30న నిర్వహించే చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు కిష్టయ్య, బాబు, సిర్పంగి శంకరయ్య, ఏర్పుల నర్సింహ, సుక్క పద్మ, హంసమ్మ, కోట జయమ్మ, పొట్ట పోషమ్మ పలువురు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం ఉద్యోగుల బదిలీలు నిలిపివేస్తే ఊరుకోం



మాట్లాడుతున్న కర్రె ప్రవీణ్

యాదగిరిగుట్ట రూరల్: పైరవీలతో యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఉద్యోగుల బదిలీలు నిలిపివేస్తే ఊరుకునేది లేదని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ అన్నారు. బుధవారం యాదగిరిగుట్ట పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే యాదాద్రి కొండపైన పనిచేస్తున్న దేవస్థాన ఉద్యోగుల బదిలీల ప్రక్రియ చేపట్టిందన్నారు. కానీ ఆ ఉద్యోగులు బదిలీపై వెళ్లడం ఇష్టం లేక, ఎమ్మెల్యే దగ్గరకి వెళ్లి వినతి పత్రాలు అందించి, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి బదిలీలను ఆపే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. నిష్పక్షపాతంగా బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే స్థానిక ఎమ్మెల్యే ఇంటి వద్ద బీజేపీ ఆధ్వర్యంలో ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బండారపు మల్లేష్ గౌడ్, కార్యదర్శి దొమ్మాట ప్రభాకర్, ఓబీసీ మెర్చా అధ్యక్షుడు మందోజు నరేష్, బీజేవైఎం అధ్యక్షులు బోడా బుచ్చిబాబు, పలుగుల సురేష్, బూడిద సన్ని, సుధగాని శివ తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చివేత



గుంతల్లో మొరం పోసి దోజరుతో చదును చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

ఆత్మకూరు(ఎం): ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రంలోని అంగడీ రోడ్డంతా గుంతలు ప డి అధ్వానంగా మారిన పరిస్థితిపై ఈ నెల 22న 'రోడ్లన్నీ..బురదమయం 'అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అ ధికార యంత్రాంగం స్పందించింది. బుధవారం అంగడీ రోడ్డుపై ఏర్పడిన గుంతలను మొరం పోసి పూ డ్చి వేయించారు. అదేవిధంగా కాటేపల్లి–ముత్తిరెడ్డిగూడెం రోడ్డు గుంతలను మట్టితో పూడ్చివేయించారు.

పశువులను తరలిస్తున్న డీసీఎం పట్టివేత

చౌటుప్పల్: ఎలాంటి అనుమతులు లేకుండా పశువులను తరలిస్తున్న డీసీఎంను బుధవారం చౌటుప్పల్ పోలీసులు పట్టుకున్నారు. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామానికి చెందిన డీసీఎం డ్రైవర్ అరకాటి సాయికృష్ణకుమార్ డీసీఎంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరులోని సంత నుంచి 76 పశువులను కొనుగోలు చేసి వాహన యజమాని రామకృష్ణ సూచన మేరకు హైదరాబాద్ తరలిస్తున్నాడు. మార్గమధ్యలో చౌటుప్పల్ మండలం తూఫ్రాన్‌పేట గ్రామ శివారులో వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు డీసీఎం ఆపి తనిఖీ చేయగా అందులో 44 ఆవులు, 32 కోడె దూడలు ఉన్నాయి. పట్టుబడిన పశువులను గోశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేత



విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న దేవాన్ష్ ఫౌండేషన్ సభ్యులు

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని సాదువెల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం దేవాన్ష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్, భోజన ప్లేట్‌లను అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ మీస మల్లయ్య, శశికళ, వెంకటేశం, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బుడిగె పెంటయ్య, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూకంటి ప్రవీణ్ కుమార్, ఇంజ మహేష్, ప్రధానోపాధ్యాయులు పాండురంగం, సోమయ్య, బాలరాజ్, ప్రసాద్, గణేష్ పాల్గొన్నారు.

వివేకానంద జీవిత చరిత్ర పుస్తకాల పంపిణీ

రామన్నపేట: మండలంలోని కొమ్మాయిగూడెం ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం యజ్ఞ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివేకానంద జీవితం–సందేశం పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ పాలెం వెంకటేష్, సభ్యులు యాట మహేందర్, ఎర్రబోయిన శ్రీను, నల్ల ఉదయ్, నల్ల భూమిక, కాకులారం రాణాప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఐఏఎస్ స్మితా సబర్వాల్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

రాజాపేట : సివిల్స్‌లో దివ్యాంగుల కోటాపై ఐఏఎస్ స్మితా సబర్వాల్ చేసిన వ్యాఖ్యలు వికలాంగులను అగౌరవపరిచేలా ఉన్నాయని ఆమెపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం వికలాంగుల హక్కుల పోరాట సమితి మండల కమిటీ ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు క్షమాపణలు చెప్పాలన్నారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల సంఘం నాయకులు ధార రాజు, ప్రజా సంఘం నాయకులు జెల్ల మహదేవ్, దాసరి జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని బాహుపేట గ్రామంలో బుధవారం విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందింది. బాహుపేట గ్రామానికి చెందిన గంగదారి రమేష్ తన ఆవును వ్యవసాయ బావి వద్ద గడ్డి మేపుతుండగా.. పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైరును తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. ప్రభుత్వం నష్టపరిహారం అందజేయాలని బాధిత రైతు కోరుతున్నాడు.

బైక్‌ను ఢీకొట్టిన ఆటో.. యువకుడికి తీవ్ర గాయాలు

యాదగిరిగుట్ట రూరల్: బైక్‌పై వెళ్తున్న యువకుడిని ఆటో ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామ పరిధిలో వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై బుధవారం జరిగింది. వంగపల్లి గ్రామానికి చెందిన కానుగంటి వినయ్ బైక్‌పై వంగపల్లి నుంచి భువనగిరి వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో కూలీలతో వస్తున్న ఆటో రాంగ్ రూట్‌లో వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వినయ్‌కి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో భువనగిరిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

తెలంగాణపై కేంద్రం వివక్ష



రామన్నపేట : అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

రామన్నపేట : కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి నిధుల కేటాయింపులో వివక్ష చూపించిందని సీపీఎం మండల కమిటీ సభ్యుడు గాదె నరేందర్ అన్నారు. నిధుల కేటాయింపులో కేంద్రం వివక్షత చూపిందని ఆరోపిస్తూ సీపీఎం పట్టణశాఖ ఆధ్వర్యంలో బుధవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కందుల హన్మంత్, బావండ్లపల్లి బాలరాజు, పిట్టల శ్రీనివాస్, గొరిగె సోములు, బావండ్లపల్లి సత్యం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి

మోత్కూరు : కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి ప్రధాని నరేంద్ర మోదీ మొండిచేయి చూపించారని బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకుబ్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. కేసీఆర్ మీద కోపంతో తెలంగాణ రాష్ట్రాన్ని ఆగం చేయడానికి చంద్రబాబునాయుడు మరోమారు నరేంద్రమోడీతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు.

ఆర్థికసాయం అందజేత

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని ధర్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రత్నం శేఖర్ ఇటీవల మృతి చెందాడు. నిరుపేద మృతుడి కుటుంబానికి ధర్మారెడ్డిపల్లి, సల్లోనిగూడెం గ్రామాల ప్రజలు, యువకులు కలిసి రూ.69,616ల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ సుర్వి కాటం రాజుగౌడ్, సామ జంగారెడ్డి, క్లెం జంగారెడ్డి, సుర్వి శ్రీనివాస్‌గౌడ్, మాద్గుల హరిబాబు, కనకబోయిన భాస్కర్, కొమిరె విజయ్, పరమేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రానికి చెందిన పసుల పిచ్చమ్మ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం మృతురాలి కుటుంబాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, తాజా మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్ పరామర్శించి రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జిల్లా శేఖరరెడ్డి, మాజీ ఎంపీటీసీ దిగోజు నర్సింహచారి, పోతగాని మల్లేశం గౌడ్, ఎద్దు వెంకన్న పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ జన్మదిన వేడుకలు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లావ్యాప్తంగా బుధవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.



భువనగిరి : రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్



బీబీనగర్ : చిరువ్యాపారులకు గొడుగులు అందజేస్తున్న ఏనుగుల రాకేష్‌రెడ్డి



భూదాన్‌పోచంపల్లిలో..

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

భువనగిరిటౌన్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ రామాంజులరెడ్డితో కలిసి పట్టణంలోని 20వవార్డులో ఆయన పర్యటించారు. ఈ కార్యక్రమంలో శానిటరీఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావు ఉన్నారు.

పీడీఎస్‌యూ నాయకుల అరెస్టు

యాదగిరిగుట్ట రూరల్: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ–పీవైఎల్ ఆధ్వర్యంలో చేపట్టిన అసెంబ్లీ ముట్టడికి తరలి వెళ్లకుండా మండలానికి చెందిన పలువురు పీడీఎస్‌యూ–పీవైఎల్ నాయకులను బుధవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ–పీవైఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బేజాడీ కుమార్ మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు. అరెస్టయిన వారిలో పలువురు పీడీఎస్‌యూ–పీవైఎల్ నాయకులు పాల్గొన్నారు.